నమస్తే తెలంగాణ
నిపుణ
Guide to Excellence
08.
www.nipuna.ntnews.com,
www.facebook.com/ntnipuna
nipuna
Every Wednesday Free Supplement
17 ఏప్రిల్ 2024
పేజీలు 8


**కత్రిన్ జకొబ్సిడొట్టిర్**

ఐస్‌లాండ్ ప్రధానమంత్రి కత్రిన్ జకొబ్సిడొట్టిర్ తన పదవికి రాజీనామా చేశారు. అధ్యక్ష ఎన్నికల్లో పాల్గొనేందుకు ఈ నిర్ణయం తీసుకున్నారు.

**మీనేష్ షా:** నేషనల్ కో ఆపరేటివ్ డెయిరీ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్‌కు కొత్త చైర్మన్‌గా మీనేష్ షా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

**పీటర్ హిగ్స్:** బ్రిటన్ శాస్త్రవేత్త పీటర్ హిగ్స్ మరణించారు.

## రోజులు

**ఏప్రిల్ 12**

- ఏటా ఏప్రిల్ 12న ఇంటర్నేషనల్ డే ఆఫ్ హ్యూమన్ స్పేస్ ఫ్లైట్ డే గా నిర్వహిస్తారు. అంటే మానవుడు అంతరిక్షంలో ప్రయాణించిన రోజు. 1961లో ఇదే తేదీన యూరీ గగారిన్ అంతరిక్షంలోకి వెళ్లారు. ఆయన రష్యా పౌరుడు. ఈ రోజు నిర్వహణకు 2011లో ఐక్యరాజ్యసమితి సాధారణ సభ ఒక తీర్మానాన్ని ఆమోదించింది.




**ఏప్రిల్ 11**

- పార్కిన్‌సన్ వ్యాధి రోజుగా ఏటా ఏప్రిల్ 11న జరుపుతారు. ఈ వ్యాధి గురించి అవగాహన కల్పించి, వ్యక్తులకు సాయం చేయాలన్నది ఉద్దేశం.

**ఏప్రిల్ 7**

- ఏటా ఏప్రిల్ 7న ప్రపంచ ఆరోగ్య దినోత్సవంగా నిర్వహిస్తారు. జెనీవా కేంద్రంగా ప్రపంచ ఆరోగ్య సంస్థను 1948, ఏప్రిల్ 7న ఏర్పాటు చేశారు. ఈ ఘటనను పురస్కరించుకొనే ఏప్రిల్ 7ని ప్రపంచ ఆరోగ్యపు రోజుగా నిర్వహిస్తారు. ఈ ఏడాది ఇతివృత్తం 'నా ఆరోగ్యం నా హక్కు'

**ఏప్రిల్ 6**

- ఏటా ఏప్రిల్ 6న ఇంటర్నేషనల్ డే ఆఫ్ స్పోర్ట్స్ ఫర్ డెవలప్‌మెంట్‌గా నిర్వహిస్తారు. అంటే శాంతి, అభివృద్ధి కోసం అంతర్జాతీయ క్రీడా రోజు. తొలిసారి ఈ రోజును 2014లో నిర్వహించారు. ఐక్యరాజ్యసమితి సాధారణ సభ తీర్మానం మేరకు ఈ రోజును నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది ఇతివృత్తం 'శాంతి యుత- సమ్మిళిత సమాజం సాధించేందుకు క్రీడలు'.

**ఏప్రిల్ 6**

- ఏటా ఏప్రిల్ 6న జాతీయ గ్రంథాలయ రోజుగా నిర్వహిస్తారు. సమాజంలో గ్రంథ పాలకుల పాత్రను తెలియజేసేందుకు ఉద్దేశించింది ఈ రోజు.

## అంతర్జాతీయం

**మానవ హక్కుల మండలి**

- ఇంటర్‌సెక్స్‌కు చెందిన వారి హక్కుల పరిరక్షణకు ఐక్యరాజ్యసమితి మానవ హక్కుల మండలి ఒక తీర్మానాన్ని ఆమోదించింది. జెనీవా కేంద్రంగా పనిచేసే మానవ హక్కుల మండలిలో 47 దేశాలకు సభ్యత్వం ఉంది. ఇంటర్‌సెక్స్ లేదా ఉభయ లింగ వ్యక్తులకు హక్కులు కల్పిస్తూ ప్రవేశపెట్టిన తీర్మానానికి 24 దేశాలు అనుకూలంగా ఓటు వేయగా, 23 దేశాలు గైర్హాజరయ్యాయి. ఈ తీర్మానాన్ని ఫిన్‌లాండ్, దక్షిణాఫ్రికా, చిలీ, ఆస్ట్రేలియా తదితర దేశాలు ప్రవేశపెట్టాయి. ఐక్యరాజ్యసమితి గణాంకాల ప్రకారం మొత్తం ప్రపంచ జనాభాలో 1.7 శాతం మంది ఉభయ లింగ జీవులుగా జన్మించారు.

**ఎస్ఏఆర్ఏహెచ్**

- దీని విస్తరణ రూపం- స్మార్ట్ ఏఐ రిసోర్స్ అసిస్టెంట్ ఫర్ హెల్త్. ఆరోగ్యానికి సంబంధించి పక్కా సమాచారాన్ని అందించేందుకు దీన్ని ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రారంభించింది. కృత్రిమ మేధను వినియోగించి ఎనిమిది భాషల్లో సంభాషించే పరిజ్ఞానం దీనికి ఉంది. 24/7 పద్ధతిలో సేవలను ఇది అందిస్తుంది.

**సిట్వే పోర్ట్**

- మయన్మార్‌లో సిట్వే పోర్ట్‌ను భారత్ దక్కించుకుంది. నౌకా యానంలో ఉనికిని చాటుకోవడంతో పాటు ప్రాంతీయ అనుసంధానాన్ని పెంచుకొనేందుకు ఇది ఉపయోగపడుతుంది. భారత్‌కు ఇది విదేశాల్లో రెండో పోర్ట్. మొదటిది ఇరాన్‌లోని చాహబర్ పోర్ట్. మయన్మార్‌లోని సిట్వే ఒప్పందానికి భారత విదేశీ మంత్రిత్వ శాఖ ఆమోదం తెలిపింది.



**భద్రతామండలి**

- ఐక్యరాజ్య సమితిలో పాలస్తీనాకు పూర్తి స్థాయి సభ్యత్వానికి సంబంధించి భద్రతామండలి కీలక నిర్ణయం తీసుకుంది. దరఖాస్తును పూర్తి స్థాయి ఐక్యరాజ్యసమితి సభ్యత్వ కమిటీకి పంపింది. సభ్యత్వం కావాలంటే భద్రతామండలిలో తొమ్మిది దేశాలు అంగీకరించాలి. ఆ తర్వాత ఆ ప్రతిపాదనను సాధారణ సభకు పంపుతారు. అక్కడ 2/3వ వంతు మెజారిటీ అవసరం.

**వరల్డ్ యాంటీ డోపింగ్ ఏజెన్సీ**

- డోపింగ్‌కు పాల్పడుతున్న వారిలో ఎక్కువ శాతం భారతీయులే అని వరల్డ్ యాంటీ డోపింగ్ ఏజెన్సీ పేర్కొంది. 2022లో పరీక్షించిన గణాంకాలను విడుదల చేసింది. ఈ సంస్థ కెనడాలోని మాంట్రియల్ కేంద్రంగా పనిచేస్తుంది. దీన్ని 1999, నవంబర్ 10న ఏర్పాటు చేశారు.

**ముడి చమురు దిగుమతి**

- రష్యా నుంచి ముడి చమురు దిగుమతిలో భారత్‌ను చైనా అధిగమించింది. సముద్ర మార్గం గుండా మార్చి నెలలో చైనా రోజుకు 1.82 మిలియన్ బ్యారెళ్లను దిగుమతి చేసుకోగా, భారత్ రోజుకు 1.36 మిలియన్ బ్యారెళ్లు మాత్రమే పొందింది.

**మాల్దీవులకు ఎగుమతులు**

- ద్వైపాక్షిక సంబంధాల్లో భాగంగా అత్యధిక స్థాయిలో ఎగుమతులను మాల్దీవులకు భారత్ మంజూరు చేసింది. 1981 తర్వాత ఈ స్థాయిలో మాల్దీవులకు వస్తువులను ఎగుమతి చేయడం ఇదే ప్రథమం.

**సింగపూర్ తిరస్కరణ**

- 2026లో కామన్‌వెల్త్ క్రీడలను నిర్వహించే ప్రతిపాదనను సింగపూర్ తిరస్కరించింది. నిజానికి ఈ క్రీడలు ఆస్ట్రేలియాలోని విక్టోరియా రాష్ట్రంలో జరగాలి. కానీ క్రీడల నిర్వహణ నుంచి తప్పుకోవడంతో మలేషియా, సింగపూర్ పేర్లు తెరపైకి వచ్చాయి. ఈ రెండు దేశాలు కూడా సుముఖత వ్యక్తం చేయలేదు. ఈ క్రీడలు 2010లో భారత్‌లో నిర్వహించారు.

**కుష్ మాదకద్రవ్యం**

- పశ్చిమ ఆఫ్రికాలోని దేశం సియెర్రాలియోన్. ఈ దేశంలో 'కుష్' అనే మాదక ద్రవ్యాన్ని విస్తృతంగా వినియోగిస్తున్న నేపథ్యంలో కట్టడి చేయాలన్న ఉద్దేశంతో జాతీయ అత్యవసర పరిస్థితిని ప్రకటించారు.

**జిగ్ కరెన్సీ**

- తీవ్ర ద్రవ్యోల్బణంతో ఇబ్బంది పడుతున్న జింబాబ్వే ఆర్థిక వ్యవస్థలో స్థిరత్వాన్ని తీసుకొచ్చేందుకు కొత్త కరెన్సీని అందుబాటులోకి తెచ్చింది. దీనికి జిగ్ అని పేరు పెట్టింది. దీని పూర్తి రూపం జింబాబ్వే గోల్డ్.



## జాతీయం

**అంటార్కిటికా**

- అంటార్కిటికాలో భారత్‌కు చెందిన భారత పరిశోధన కేంద్రంలో కొత్త పోస్టాఫీస్ శాఖను ప్రారంభించారు. దీనికి ఎంహెచ్-1718 అనే పిన్‌కోడ్‌ను కూడా ఇచ్చారు. భారత్ తొలిసారి పోస్టాఫీస్‌ను 1984లో అంటార్కిటికాలో



ఏర్పాటు చేసింది. అప్పట్లో దక్షిణ గంగోత్రి అనే శాస్త్ర పరిశోధన కేంద్రం అక్కడ ఉండేది.

**మొబైల్ యాప్**

- ప్రభుత్వ సెక్యూరిటీలు, రిటెయిల్ పెట్టుబడిదారుల సౌకర్యం కోసం ఒక మొబైల్ యాప్‌ను అభివృద్ధి చేయాలని ఆర్‌బీఐ నిర్ణయించింది. ప్రభుత్వ సెక్యూరిటీలు, రిటెయిల్ పెట్టుబడులను పెంచేందుకు ఉద్దేశించింది ఇది. 2021 నవంబర్‌లో ఆర్‌బీఐ రిటెయిల్ డైరెక్ట్ స్కీమ్‌ను ప్రారంభించింది. ప్రభుత్వ సెక్యూరిటీల్లో నేరుగా పెట్టుబడులను పెట్టేందుకు ఉద్దేశించింది ఈ పథకం.

**రాఖీఘరి**

- ఇది సింధూ నాగరికత నాటి నగరం. ఇక్కడ తవ్వకాల్లో లభించిన కొత్త వస్తువులను ఎన్‌సీఈఆర్‌టీ పుస్తకాల్లో కలపాలని నిర్ణయించింది. ఇక్కడ లభించిన శిలాజాల మూలాలు క్రీ.పూ 10,000 సంవత్సరం ఉన్న జన్యు మూలాలతో కలిశాయి. అంటే అప్పటి నుంచే ఇక్కడ జీవనం కొనసాగుతుంది.



**కృత్రిమ మేధ**

- కృత్రిమ మేధను వినియోగించి భారత్, అమెరికా, దక్షిణ కొరియా ఎన్నికలను ప్రభావితం చేసేందుకు చైనా యత్నిస్తుందని మైక్రోసాఫ్ట్ హెచ్చరించింది. ప్రపంచ వ్యాప్తంగా ఈ ఏడాది కనీసంగా 64 దేశాల్లో ఎన్నికల నిర్వహణ ఉంది. ఈ దేశాల్లోనే ప్రపంచ జనాభా 49 శాతం ఉంది. కృత్రిమ ఆధారితంగా రూపొందించిన వివిధ సమాచారం, వీడియోలను సామాజిక మాధ్యమాల ద్వారా విస్తృతంగా ప్రచారం చేసి, ప్రజలపై ఒక అభిప్రాయాన్ని కలిగించాలని చైనా కుట్ర చేస్తుందని మైక్రోసాఫ్ట్ ఆరోపించింది. డీప్‌ఫేక్‌లను కూడా ఇందులో చేర్చనుంది.

**ఎన్‌టీపీసీ**

- బాలికల సాధికారత కోసం ఎన్‌టీపీసీ కొత్త విధానాన్ని ప్రకటించింది. కేంద్రం ప్రారంభించిన బేటీ బచావో బేటీ పఢావోలో ఇది భాగం. లింగ సమానత్వం సాధించడంతో పాటు బాలికలు ఉన్నత చదువులు చదవడం, సామాజిక ఆర్థిక వృద్ధి సాధించేందుకు ఉద్దేశించిన కార్యక్రమం ఇది. 3000 మంది బాలికలు దీని ఫలితంగా లబ్ధి పొందనున్నారు. నైపుణ్యం పెంపు, యోగా, క్రీడలు, పరిశుభ్రత తదితర అంశాల్లో శిక్షణ ఇస్తారు.

## సైన్స్ అండ్ టెక్నాలజీ

**టీశాట్-1ఏ ఉపగ్రహం**

- భారతదేశ తొలి ప్రైవేట్ సబ్-మీటర్ రిజల్యూషన్‌లో ఉండే భూ పరిశీలక ఉపగ్రహం టీశాట్-1ఏ ను అమెరికాలోని స్పేస్ ఎక్స్



ఫాల్కన్-9 రాకెట్ ద్వారా ప్రయోగించారు. దీన్ని టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ లిమిటెడ్ ప్రయోగించింది. అంతరిక్షంలోని అనేక వ్యవస్థలకు సంబంధించి అధిక రిజల్యూషన్‌తో చిత్రాలను తీస్తుంది.

**నెప్టిస్ ఫిలైరా**

- అత్యంత అరుదుగా ఉండే నెప్టిస్ ఫిలైరా అనే జాతిని భారతదేశంలో తొలిసారి అరుణాచల్ ప్రదేశ్‌లో గుర్తించారు. ఇది సీతాకోక చిలుకకు సంబంధించింది. ఇప్పటివరకు ఈ తరహా సీతాకోక చిలుక కేవలం తూర్పు ఆసియాలో మాత్రమే కనిపించింది. జపాన్, కొరియా, అలాగే వాయవ్య చైనా, సైబీరియా ప్రాంతాల్లో కూడా కనిపించేది. తాజాగా భారత్‌లో ఇది కనిపించింది.

**లేజర్**

- ప్రపంచంలో అత్యంత శక్తిమంతమైన లేజర్‌ను రొమేనియా అభివృద్ధి చేసింది.

**ప్రాజెక్ట్ ఆకాశ్‌తీర్**

- ప్రాజెక్ట్ ఆకాశ్‌తీర్‌లో భాగంగా ఆకాశ్‌తీర్ కమాండ్ అండ్ కంట్రోల్ సిస్టమ్స్‌ను భారత సైన్యం ప్రారంభించింది. ఆత్మనిర్భర్ భారత్‌లో భాగంగా దీన్ని భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ రూపొందించింది. వాయు రక్షణ వ్యవస్థను స్వయం చాలకంగా రూపొందించడంలో భాగంగా దీన్ని ప్రారంభించారు

## వార్తల్లో వ్యక్తులు

**బిల్కిస్ మిర్**



- ఈ ఏడాది జూలై 26 నుంచి ఆగస్టు 11 వరకు జరగనున్న ఒలింపిక్స్ పోటీల్లో న్యాయ సభ్యురాలిగా జమ్మూకశ్మీర్‌కు చెందిన బిల్కిస్ మిర్ ఎంపికయ్యింది. ఈ ఘనతను దక్కించుకున్న భారత తొలి మహిళ ఆమె. చైనాలో గతేడాది నిర్వహించిన ఏషియన్ క్రీడల్లో కూడా ఆమె జ్యూరీ సభ్యురాలిగా వ్యవహరించారు. క్రీడల్లో ఆమె తన ప్రస్థానాన్ని 1998లో ప్రారంభించింది. క్రీడల్లో ఈ పదవికి సంబంధించిన పరీక్షలో 2008లో ఉత్తీర్ణత సాధించింది.

**మనోజ్ పాండా**

- 16వ ఆర్థిక సంఘం సభ్యుడిగా మనోజ్ పాండాను నియమించారు. దీనికి అరవింద్ పనగారియా నేతృత్వం వహిస్తున్నారు. ఇప్పటికే ఈ కమిటీలో అజయ్ నారాయణ్ ఝా, అనీ జార్జ్ మాథ్యూ, నిరంజన్ రాజాధ్యక్ష, సౌమ్య కాంతి ఘోష్ ఉన్నారు.

**సైమన్ హ్యారిస్**

- ఈయన ఐర్లాండ్ నూతన ప్రధాన మంత్రి. ఆ దేశానికి ఇప్పటివరకు ప్రధాని అయిన వారిలో అత్యంత పిన్న వయస్కుడు అతడు.

**పీటర్ పెల్లెగ్రిని**



- స్లొవేకియా అధ్యక్ష ఎన్నికల్లో పీటర్ పెల్లెగ్రిని విజయం సాధించారు. రష్యాకు అనుకూలంగా ఉంటారని ఆయనకు పేరుంది.

## తెలంగాణ

**యూఎన్‌డీపీతో ఒప్పందం**

- రాష్ట్ర స్థాయిలో వనరుల సమీకరణతో జీవ వైవిధ్య కార్యాచరణ ప్రణాళిక అమలులో తెలంగాణ తొలి రాష్ట్రంగా నిలిచింది. అలాగే కున్మింగ్ మాంట్రియల్ అంతర్జాతీయ జీవ వైవిధ్య ప్రణాళికకు అనుగుణంగా కార్యాచరణ చేపడతారు. ఇందుకు యూఎన్‌డీపీతో ఒప్పందం కుదిరింది. యూఎన్‌డీపీ అంటే.. యునైటెడ్ నేషన్స్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం. ఇది న్యూయార్క్ కేంద్రంగా పనిచేస్తుంది.

**మివి పెట్టుబడులు**

- స్వదేశీ ఆడియో ఎలక్ట్రానిక్ పరికరాల తయారీ సంస్థ మివి అత్యాధునిక ప్లాంట్‌ను తెలంగాణలో నెలకొల్పింది. రంగారెడ్డి జిల్లా మహేశ్వరంలో ఆరున్నర ఎకరాల విస్తీర్ణంలో ఉంది. ఇందుకు రూ.225 కోట్ల పెట్టుబడి పెట్టారు.



**టెలికాం సేవల్లో రెండో స్థానం**

- దేశంలో టెలికాం సేవల వినియోగంలో తెలంగాణ రెండో స్థానంలో నిలిచింది. తొలి



స్థానంలో కేరళ నిలిచింది. తెలంగాణలో వినియోగిత 108.19 శాతం ఉంది.

**సామాజిక తనిఖీ**

- మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనుల సామాజిక తనిఖీ వంద శాతం పూర్తయ్యింది. 2022-23లో సంవత్సరానికి సంబంధించిన తనిఖీ ఇది. 100 శాతం పూర్తి చేసిన రాష్ట్రాలు కేవలం తెలంగాణ, కేరళ మాత్రమే ఉన్నాయి.


వి. రాజేంద్ర శర్మ
ఫ్యాకల్టీ
9849212411


